పూలే ఆశయ సాధనకు కృషి చేయాలి

ఏలూరు:సమాన హక్కుల సాధనకు, అట్టడుగు జాతుల విద్యాభివృద్ధికి సమాజంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిన మహాత్మ జ్యోతిబాపూలే గొప్ప దార్శనికుడని ఇన్‌ఛార్జి కలెక్టర్ బి.లావణ్యవేణి పేర్కొన్నారు. స్థానిక కలెక్టరేట్‌లోని గౌతమి సమావేశ మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం పూలే 133వ వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పూలే చిత్రపటానికి లావణ్యవేణి పూలమాలవేసినివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సామాన్య కుటుంబంలో జన్మించిన పూలే మహోన్నత స్థాయికి ఎదిగి అందరికీ ఆదర్శప్రాయులయ్యారన్నారు. బాలికలకు విద్య అవసరాన్ని ఆనాడే గుర్తించి అందుకు అవసరమైన కృషిచేశారన్నారు. కుల వ్యవస్థను వ్యతిరేకించి సమసమాజ స్థాపనకు కృషిచేశారని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ అధికారి ఆర్.వి.నాగరాణి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జివివి.సత్యనారాయణ, జిల్లా పరిశ్రమల కేంద్రం జిఎం ఆదిశేషు, ఎపిబిఎసి జెడ్‌ఎం బాబ్జీ, సెట్ వెల్ సిఇఒ ఎమ్‌డి మెహర్రాజ్, కలెక్టర్ పరిపాలనాధికారి రమాదేవి పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు సక్రమంగా అందని వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ

నెలలో 25 రోజులకుగాను సగం రోజులే సరఫరా

పిల్లలకు ఆహారం పెట్టేందుకు అంగన్‌వాడీలు నానావస్థలు

రెండు జిల్లాల్లో దాదాపు 50 వేల మందికిపైగా చిన్నారులు

కేంద్రాల అద్దె బకాయిలు చెల్లింపులోనూ నిర్లక్ష్యమే

చిన్నారులకు ఆహారం అరకొరే..!

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు ఆహారం సరఫరాలో తీవ్ర నిర్లక్ష్యం కొనసాగుతోంది. అంగన్‌వాడీ కేంద్రాలకు సరుకుల సరఫరా అస్తవ్యస్తంగా మారినా అడిగే నాథుడే లేకుండాపోయాడు. దీంతో చిన్నారులకు ఆహారం పెట్టేందుకు అంగన్‌వాడీలు పడుతున్న అవస్థలు వర్ణనాతీతం. పూర్వ ప్రాథమిక విద్య అందించడంలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో మూడు నుంచి ఆరేళ్ల పిల్లలను చేర్చుకుంటున్నారు. ఏలూరు జిల్లాలో పది ఐసిడిఎస్ ప్రాజెక్టులు ఉండగా వీటి పరిధిలో 2,289 వరకూ అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఈ కేంద్రాల్లో మూడు నుంచి ఆరేళ్ల వయస్సు గల పిల్లలు 30 వేల మందికిపైగా ఉన్నారు. పశ్చిమగోదావరి జిల్లాలో ఏడు ప్రాజెక్టుల పరిధిలో 1,662 కేంద్రాలు ఉండగా 20 వేల మందికిపైగా చిన్నారులు ఉన్నట్లు తెలుస్తోంది. అంగన్‌వాడీ కేంద్రాలకు చిన్నారులు ఉదయం తొమ్మిది గంటలకు కేంద్రానికి వచ్చి సాయంత్రం నాలుగు గంటల వరకూ ఉంటారు. కేంద్రాలకు వచ్చే చిన్నారులకు వైఎస్ఆర్ సంపూర్ణ పోషణలో భాగంగా ఆహారం అందిస్తున్నారు.

నెలలో 25 రోజులకు సరిపడా ఆహారం అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేయాల్సి ఉండగా 15 నుంచి 20 రోజుల్లోపు వరకే సరఫరా చేస్తున్నారు. దీంతో మిగిలిన రోజుల్లో చిన్నారులకు ఆహారం పెట్టేందుకు అంగన్‌వాడీ ఉద్యోగులు నానావస్థలు పడుతున్నారు. పక్క కేంద్రాల్లో ఉంటే తెచ్చుకోవడం, లేకపోతే ఇంట్లో సరుకులు తీసుకెళ్లి వంటచేసి పెట్టడం చేయాల్సి వస్తోంది. చాలా నెలలుగా ఇదే పరిస్థితి కొనసాగుతున్నా ఏఒక్క అధికారీ పట్టించుకోవడం లేదు. గట్టిగా మాట్లాడితే గర్భిణులకు ఇచ్చే ఆహారం తగ్గించి చిన్నారులకు సర్దుబాటు చేయాలన్నట్లు చెబుతున్నట్లు తెలుస్తోంది. తాము ఇండెంట్ సక్రమంగానే పెడుతున్నామని అధికారులు చెప్పడం మినహా చర్యలు మాత్రం లేవు. అరకొరగా సరఫరా చేస్తున్న కాంట్రాక్టర్లపై చర్యలు మాత్రం లేకుండాపోయాయి. సంపూర్ణ పోషణ ఆహారం నెలలో సగం రోజులు కూడా అందించకపోతే చిన్నారులకు ఏవిధంగా పోషకాహారం అందుతుందో ప్రభుత్వం, అధికారులు చెప్పాలి. అంగన్‌వాడీ కేంద్రాలకు సంబంధించి ఆహారం సరఫరా నుంచి భవనాలకు అద్దె చెల్లించే వరకూ అంతటా తీవ్ర నిర్లక్ష్యం తాండవిస్తున్న పరిస్థితి ఉంది.

అద్దె బకాయిలు ఇవ్వరు.. బెనిఫిట్స్ అందించరు

రెండు జిల్లాల్లోనూ అత్యధిక అంగన్‌వాడీ కేంద్రాలు అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. గ్రామాలు, మున్సిపాల్టీలు, కార్పొరేషన్ల ప్రాతిపదికన అద్దె చెల్లించాల్సి ఉంది. అద్దె రూ.రెండు వేల నుంచి రూ.ఐదు వేల వరకూ ఉంది. చాలాకాలంగా భవనాలకు అద్దె చెల్లించకపోవడంతో బకాయిలు పేరుకుపోయాయి. యజమానుల నుంచి అంగన్‌వాడీ ఉద్యోగులకు తీవ్రమైన ఒత్తిడి ఎదురవుతోంది. ఇవేమీ ప్రభుత్వానికి పట్టడం లేదు. ఉద్యోగ విరమణ పొందిన అంగన్‌వాడీ ఉద్యోగులకు ఇవ్వాల్సిన రూ.50 వేల సొమ్ము సైతం ఇవ్వని దుస్థితి నెలకొంది. అంగన్‌వాడీలు ఉద్యోగ విరమణ పొందాక కూడా ప్రభుత్వ ఉద్యోగులుగా ఆన్‌లైన్‌లో చూపించడంతో ప్రభుత్వ పథకాలు ఏవీ అందకుండా పోతున్నాయి. దీంతో అంగన్‌వాడీ కుటుంబాలు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం.

వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ మెనూ

సోమవారం: అన్నం, దోసకాయ పప్పు, ఉడికించిన కోడిగుడ్డు, పాలు

మంగళవారం:పులిహోర, టమోటా పప్పు, కోడిగుడ్డు, పాలు

బుధవారం: అన్నం, ఆకుకూర పప్పు, కోడిగుడ్డు, పాలు

గురువారం: అన్నం, ఆకుకూర, కూరగాయలతో సాంబారు, కోడిగుడ్డు, పాలు

శుక్రవారం: అన్నం, బీరకాయ లేదా సొరకాయ, మునగాకు లేదా పాలకూర, ఉడికించిన కోడిగుడ్డు, పాలు

శనివారం: వెజిటబుల్ రైస్, ఆకుకూర, కూరగాయలతో సాంబారు, కోడిగుడ్డు, పాలు

నేవీ ఆయుధ సామగ్రి డిపో ఏర్పాటుపై

సర్వత్రా ఆగ్రహం

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఒంటెద్దుపోకడ నిర్ణయాలతో ఇటీవల కాలంలో ఏజెన్సీ గ్రామాల మధ్య నేవి ఆయుధ యుద్ధ సామగ్రి డిపోలను ఏర్పాటు చేయనున్నట్లు అధికారిక ప్రకటనలు బయటకు రావడంతో ఏజెన్సీవాసులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. యుద్ధ సామగ్రి డిపోలను తమ ప్రాంతంలో ఏర్పాటు చేయొద్దని వంకవారిగూడెం పంచాయతీ పరిధిలోని ఐదు గ్రామాల ప్రజలు తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నారు. మొత్తం 1160 ఎకరాల భూమిలో ఆయుధ యుద్ధ సామగ్రి డిపో ఏర్పాటుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శరవేగంగా సర్వేలు సైతం పూర్తి చేయడంతో ఏజెన్సీ వాసులు ఆందోళన చెందుతున్నారు. 'మా భూముల్లో మాకు తెలియకుండా ఆయుధ యుద్ధ సామగ్రి డిపోలను ఏ విధంగా ఏర్పాటు చేస్తారు.. ఏజెన్సీ గ్రామాల్లో పరిశ్రమ ఏర్పాటు చేయాలంటే ప్రజాభిప్రాయం, గ్రామ సభ తీర్మానాలు ఉండాలి.. కానీ అలాంటివి ఏమీ లేకుండా ఏకపక్ష నిర్ణయాలతో పనులు ఎలా చేస్తారు' అంటూ ప్రభుత్వాల తీరుపై మండిపడుతున్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో పరిశ్రమలు ఏర్పాటు చేయాలంటే గ్రామసభలు నిర్వహించి, పిసా కమిటీ తీర్మానాలు చేస్తే తప్ప ముందుకు సాగడానికి వీలులేదు.. కానీ ఏజెన్సీ చట్టాలను తుంగలో తొక్కి కేంద్రంలోని మోడీ సర్కార్, రాష్ట్రంలోని వైసిపి వ్యవహరిస్తున్న తీరుపై అవేదన వ్యక్తం చేస్తున్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల తీరుకు నిరసనగా గ్రామ పంచాయతీలో హెచ్చరిక బోర్డులను సైతం ఏర్పాటు చేశారు.

పీసా కమిటీ మొత్తం పూర్తి వ్యతిరేకం

పాయం శ్రీను, పీసా కమిటీ వైస్ ప్రెసిడెంట్, మడకవారిగూడెం

మా పంచాయతీలో పిసా కమిటీ తీర్మానాలు, గ్రామ సభ తీర్మానాలు ఏమీ చేయకుండ ఆయుధ యుద్ధ సామగ్రి డిపో ఏర్పాటుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెవెన్యూ అధికారులకు ఆదేశాలివ్వడం బాధాకరం. యుద్ధ సామగ్రి డిపోలకు మేమంతా పూర్తి వ్యతిరేకం. మా ప్రమేయం లేకుండా ఆ పరిశ్రమను ఏర్పాటు చేయాలని చూస్తే ఖచ్చితంగా అడ్డుకుంటాం.

కనీసం గ్రామసభ కూడా పెట్టలేదు

కుంజా పార్వతి, వంకవారిగూడెం సర్పంచి

మా గ్రామంలో డిపో ఏర్పాటుపై ఎలాంటి తీర్మానం గానీ, గ్రామసభ గాని ఏర్పాటు చేయలేదు. ఆయుధ సామగ్రి డిపో కూడ మా పంచాయతీలో ఏర్పాటు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం చూస్తున్నట్లు అధికారిక ప్రకటనల ద్వారా తెలిసింది. డిపోను పంచాయతీ ప్రజలందరూ ముక్తకంఠంతో వ్యతిరేకిస్తున్నారు.

ఇక్కడ డిపో పెట్టడానికి వీల్లేదు

మడం శేషగిరిరావు, దాట్లవారిగూడెం

మా పంచాయతీ పరిధిలో నేవి ఆయుధ యుద్ధ సామగ్రి డిపో ఏర్పాటుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెద్దఎత్తున ప్రయత్నాలు చేస్తున్నాయి. దాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఇక్కడ పెట్టనివ్వబోము. మా ప్రమేయం లేకుండా పెట్టాలని చూస్తే మా ప్రాణాలైనా ఇస్తాం కానీ, డిపో మాత్రం పెట్టనివ్వబోము.

ఓటర్ల జాబితా సమాచారం అందించాలి : ఆర్‌డిఒ

ప్రజాశక్తి - భీమడోలు

వచ్చేనెల ఐదో తేదీన వెలువడే తుది ఓటర్ల జాబితా తయారీకి అవసరమైన సమాచారాన్ని ఈనెల 29వ తేదీ నాటికి అందజేయాలని అధికారులను ఏలూరు ఆర్‌డిఒ ఖాజావలి కోరారు. నైతిక విలువలతో కూడిన ఓటింగ్ వైపు పయనించేలా ఓటర్లను చైతన్యపరచడం, భాగస్వాములను చేయడం వంటి ప్రభుత్వ కార్యక్రమానికి ప్రత్యేకించిన (స్వీప్)ను భీమడోలు మండలస్థాయి సమావేశం ఎంపిడిఒ కార్యాలయంలో మంగళవారం ఆర్‌డిఒ నిర్వహించారు. ఈ సందర్భంగా బూత్ లెవెల్ అధికారులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా చనిపోయిన ఓటర్ల పేర్లను తొలగించడం, అర్హుల పేర్లను చేర్చడం, సవరణలు ఇతర అంశాలపై వారికి అవగాహన కల్పించారు. ఫారం-6ఎ, 6బి, 7,8 ఫారాల వినియోగం, ప్రాముఖ్యతల గురించి వివరించారు. అనంతరం భీమడోలు శ్రీవెంకటేశ్వర డిగ్రీ, జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. అర్హులు ఓటరుగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులు, అధికారుల భాగస్వామ్యంతో ఓటు ప్రాముఖ్యతను వివరిస్తూ ర్యాలీ నిర్వహించారు. భీమడోలు జంక్షన్‌లో మానవహారంగా ఏర్పడ్డారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ పద్మావతిదేవి, తహశీల్దార్ ఎం.ఇందిరాగాంధీ, పలువురు రెవెన్యూ ఉద్యోగులు పాల్గొన్నారు.

గిరిజన చట్టాలపై అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

గిరిజన చట్టాలపై ఆదివాసీలకు అవగాహన కల్పించాలని అధికారులను గిరిజన సంక్షేమ శాఖ న్యాయ సలహాదారు పల్లా త్రినాధరావు, ఐటిడిఎ పిఒ ఎం.సూర్యతేజ ఆదేశించారు. కోటరామచంద్రపురం ఐటిడిఎ సమావేశ మందిరంలో గిరిజన చట్టాలపై మంగళవారం వారు అవగాహన కల్పించారు. కోర్టు ఇచ్చిన తీర్పులను ఏజెన్సీ మండలాల తహశీల్దార్లు ఆలస్యం లేకుండా అమలు చేయాలని, అప్పుడే గిరిజన చట్టాలకు న్యాయం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సంచాలకులు (వెలుగు) ఎం.నాగేశ్వరరావు, తహశీల్దార్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

5న వికలాంగుల స్పోర్ట్స్ మీట్

ఏలూరు:వచ్చేనెల ఐదో తేదీన ప్రపంచ వికలాంగుల దినోత్సవం సందర్భంగా ఒకటో తేదీ ఉదయం ఎనిమిది గంటలకు ఏలూరు ఇండోర్ స్టేడియంలో వికలాంగుల జిల్లాస్థాయి గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్ నిర్వహించబడుతుందని వికలాంగుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ పి.రాకాడ మణి తెలిపారు. ఆసక్తి ఉన్న జిల్లాలోని వికలాంగులు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

అంగన్‌వాడీల సమ్మె జయప్రదానికి పిలుపు

కుక్కునూరు:అంగన్‌వాడీ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వచ్చేనెల ఎనిమిదో తేదీ జరిగే సమ్మెకు ప్రజలందరూ మద్దతిచ్చి జయప్రదం చేయాలని సిఐటియు మండల కార్యదర్శి యర్నం సాయికిరణ్ పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం ఆయనొక ప్రకటన విడుదల చేశారు. స్త్రీ, శిశు సంక్షేమానికి అహర్నిశలు కృషి చేస్తున్న అంగన్‌వాడీల సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిష్కరించకుండా నిర్లక్ష్యం చేస్తున్నాయని విమర్శించారు. వేతనాలు పెంచాలని, గ్రాడ్యుటీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. పలుమార్లు ప్రభుత్వాన్ని కోరినప్పటికీ పట్టించుకోకపోవడంతో నిరవధిక సమ్మెకు దిగుతున్నామని తెలిపారు. ఎనిమిదో తేదీ నుంచి నిరవధిక సమ్మెకు ముందు వివిధ రూపాల్లో ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. ప్రకటన విడుదల చేసిన వారిలో కుంజ నాగలక్ష్మి, షేక్ వలీపాషా, వెంకటేశ్వర్లు, మంగ, సుజాత పాల్గొన్నారు.

అర్హులకు ఓటు హక్కు తప్పనిసరి

ఏలూరు:ఓటు హక్కు పొందడమే కాకుండా దాన్ని వినియోగించుకుని ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగస్వామ్యం కావాలని ఇన్‌ఛార్జి కలెక్టర్ బి.లావణ్యవేణి సూచించారు. 'స్వీప్' కార్యాచరణలో భాగంగా మంగళవారం స్థానిక సర్ సిఆర్ రెడ్డి కళాశాల నుంచి ఫైర్ స్టేషన్ సెంటర్ వరకూ విద్యార్థులతో నిర్వహించిన ర్యాలీని ఆమె ప్రారంభించారు. ఈ ర్యాలీలో సిఆర్ రెడ్డి కళాశాలకు చెందిన ఎన్‌సిసి యూనిట్, నేషనల్ సర్వీస్ యూనిట్, ఇతర విద్యార్థులు, పలువురు అధికారులు పాల్గొన్నారు. కళాశాల ఆవరణలో ఓటరు నమోదు దరఖాస్తులను అందుబాటులో ఉంచారు. తొలుత సిఆర్ రెడ్డి కళాశాలలో విద్యార్థులతో నిర్వహించిన స్వీప్ కార్యక్రమంలో ఓటు హక్కు విలువ, సద్వినియోగం చేసుకోవాలని ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఇన్‌ఛార్జి కలెక్టర్ బి.లావణ్యవేణి మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటరుగా అర్హులని వారందరూ ఫారం-6 ద్వారా తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు పవిత్రమైనదని ఎన్నికల సమయంలో తమ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని కోరారు. ఓటు వేయడానికి అర్హత కలిగిన ప్రతిఒక్కరినీ ఓటు వినియోగించుకునేలా ప్రోత్సహించి ఎన్నికల్లో ఓటర్ల భాగస్వామ్యం పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. ఓటరు నమోదు కార్యక్రమం నిరంతర ప్రక్రియ అని అన్నారు. ఆన్‌లైన్‌లో కూడా ఓటరుగా నమోదు చేసుకోవచ్చున్నారు. కళాశాలల్లో ఓటరు నమోదు కార్యక్రమంపై మరింత అవహన కలిగించేందుకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించాలని సూచించారు. జెడ్‌పి సిఇఒ సుబ్బారావు మాట్లాడుతూ అతిపెద్ద ప్రజాస్వామ్యం దేశం, పటిష్టమైన రాజ్యాంగం ఉన్న మన దేశంలో అర్హులైన వారంతా ఓటరులుగా నమోదు కావాలన్నారు. వచ్చేనెల రెండు, మూడు తేదీల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం ప్రతి పోలింగ్ స్టేషన్‌లో నిర్వహించబడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సిఆర్ రెడ్డి కళాశాల ప్రిన్సిపల్ రామరాజు, ఏలురు నగర మున్సిపల్ కమిషనరు ఎస్.వెంకటకృష్ణ, తహశీల్దారు బి.సోమశేఖర్, ఎంపిడిఒ ప్రణవి, విద్యార్థులు పవన్, సురేష్ పాల్గొన్నారు.

సంయుక్త కిసాన్ మోర్చా, కేంద్ర కార్మిక సంఘాల సంయుక్త పిలుపు మేరకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా విజయవాడలో ఈ నెల 27, 28 తేదీల్లో చేపట్టిన మహాధర్నాలో రెండో రోజు మంగళవారం పాల్గొన్న ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా నేతలు

15 నుంచి ఆడుదాం..ఆంధ్ర క్రీడోత్సవాలు

ప్రజాశక్తి - ఏలూరు

రాష్ట్రంలో 15 ఏళ్ల వయస్సు పైబడిన వారిని క్రీడల్లో భాగస్వామ్యం చేయడం ద్వారా శారీరక, మానసిక దృఢత్వం, ఆనందం సొంతం చేసుకునే దిశగా నిర్వహిస్తున్న 'ఆడుదాం - ఆంధ్ర క్రీడోత్సవాల్లో ప్రతిఒక్కరూ భాస్వామ్యం కావాలని ఇన్‌ఛార్జి కలెక్టర్ బి.లావణ్యవేణి తెలిపారు. స్థానిక కలెక్టరేట్ గౌతమీ సమావేశ మందిరంలో వచ్చేనెల 15 నుంచి నిర్వహించే ఆడుదాం.. ఆంధ్ర క్రీడోత్సవాల నిర్వహణ ఏర్పాట్లను ఇన్‌ఛార్జి కలెక్టర్ బి.లావణ్యవేణి పాత్రికేయులకు మంగళవారం వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువతను క్రీడల్లో ప్రోత్సహించేందుకు, ఆరోగ్యకరమైన జీవనాన్ని సాధించడమే ఈ క్రీడల ముఖ్యోద్దేశమన్నారు. ఈ టోర్నమెంట్ మొత్తం 51 రోజుల పాటు పండగలా జరగనుందన్నారు. గ్రామ/వార్డ్ స్థాయిలో 18 రోజులపాటు, మండలస్థాయిలో 14 రోజుల పాటు జనవరి రెండో తేదీ నుండి జనవరి 15వ తేదీ వరకూ నియోజికవర్గస్థాయిలో ఆరు రోజుల పాటు జనవరి 16 నుండి జనవరి 21 వరకూ జిల్లాస్థాయిలో వారం రోజులపాటు - జనవరి 22 నుండి జనవరి 28 వరకూ రాష్ట్రస్థాయిలో ఆరు రోజులపాటు జనవరి 29 నుండి ఫిబ్రవరి రెండోతేదీ వరకూ క్రీడోత్సవాలు నిర్వహించబడతాయని తెలిపారు. 2024 ఫిబ్రవరి మూడో తేదీన విశాఖపట్టణంలో క్రీడోత్సవాలు ముగుస్తాయన్నారు. గ్రామస్థాయిలో పంచాయతీ కార్యదర్శి, మండలస్థాయిలో ఎంపిడిఒ, నియోజకవర్గస్థాయిలో వివిధ శాఖల జిల్లా అధికారులు నోడల్ అధికారులుగా వ్యవహరిస్తారన్నారు. క్రీడోత్సవాల్లో పాల్గొనే ఔత్సాహికులతోపాటు వీక్షించేందుకు వచ్చేవారు కూడా తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చున్నారు. మొబైల్ నెంబరు, ఆధార్ కార్డుతో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చున్నారు. ముఖ్యంగా క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్, కబడ్డీ, ఖో-ఖో, పోటీలేని క్రీడలు (యోగ, టెన్నీకాయిట్, మారథాన్) నిర్వహిస్తారన్నారు. ఈనెల 15 నుంచి 2024 ఫిబ్రవరి మూడో తేదీ వరకూ గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్రస్థాయిలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈనెల 27న రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమైందన్నారు. వెబ్‌సైట్ ద్వారా, సచివాలయం నుండి, 1092 హెల్ప్ లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చున్నారు. ఇందుకు ఆధార్, ఆధార్‌కు లింక్ అయిన మొబైల్ నెబర్ ఉండాలని సూచించారు. క్రీడాకారులకు టీ షర్ట్, క్యాప్, ప్రిస్ట్ బ్యాండ్ అందించబడతాయన్నారు. నియోజకవర్గ స్థాయిలో: మొదటి బహుమతి రూ.35 వేలు, రెండో బహుమతి రూ.15 వేలు, మూడో బహుమతి రూ.ఐదు వేలు (క్రికెట్, వాలీబాల్, కబడ్డీ,ఖోఖో), బ్యాడ్మింటన్‌కి మొదటి బహుమతి రూ.20 వేలు, రెండో బహుమతి రూ.పది వేలు, మూడో బహుమతి రూ.ఐదు వేలు అందిస్తామన్నారు. జిల్లా స్థాయిలో మొదటి బహుమతి రూ.60 వేలు, రెండో బహుమతి రూ.30వేలు, మూడో బహుమతి రూ.పది వేలు(క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో), బ్యాడ్మింటన్‌కు మొదటి బహుమతి రూ.35 వేలు, రెండో బహుమతి రూ.20వేలు, మూడో బహుమతి రూ.పది వేలు అందిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో సెట్ వెల్ సిఇఒ ఎమ్‌డి మోహ్రాజ్, డిఎస్‌డిఒ బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

'పెదవేగి'లో కుల రగడ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఇటీవల పెదవేగి మండలంలో మాజీ ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ గొర్రెల కాపరిని మందలించిన ఘటన చినికి చినికి గాలివానగా మారింది. చివరికి రెండు గ్రూపులు పోటాపోటీగా ధర్నాకు దిగి కలెక్టరేట్‌లో అధికారులకు ఫిర్యాదు చేసే వరకూ వచ్చింది. వివరాల్లోకి వెళితే పెదవేగి మండలం, రామచంద్రరావు గ్రామంలో గౌడ సామాజిక తరగతికి చెందిన వీరంకి లక్ష్మీనారాయణ గొర్రెల మేపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల అదే గ్రామంలో చింతమనేని ప్రభాకర్‌కు చెందిన పొలంలో అతని గొర్రెలు మేత మేయడంతో అటుగా వచ్చిన ప్రభాకర్ అదిచూసి లక్ష్మీనారాయణను మందలించి, గ్రామ పెద్దలకు ఆ విషయం చెప్పి వెళ్లిపోయారు. ఆ విషయాన్ని లక్ష్మీనారాయణ గ్రామ పెద్దలతో మాట్లాడి సరి చేసుకున్నారు. ఈ విషయాన్ని అదే గ్రామానికి చెందిన కొందరు గౌడ కుల పెద్దలు పెద్దది చేసి రాజకీయ ప్రయోజనాల కోసం తమ గౌడ కులస్తులను చింతమనేని ప్రభాకర్ అవమానించాడంటూ వాట్సాప్‌లో, సోషల్ మీడియాలో పోస్టింగులు పెట్టి చింతమనేని ప్రభాకర్‌పై అసత్య ప్రచారాలు చేశారని లక్ష్మీనారాయణ ఆరోపించాడు. లక్ష్మీనారాయణకు అండగా టిడిపికి సంబంధించిన పెదవేగి మండలంలోని గౌడ సామాజిక తరగతికి చెందిన కులపెద్దలు, ఇతర నాయకులు గ్రామస్తులు పెద్దఎత్తున కలెక్టరేట్‌కు చేరుకుని అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ, అతని భార్య రాణి, కుల పెద్దలు మోరు శ్రావణి, శివమణి, లావేటి శ్రీను మాట్లాడుతూ ఈ సంఘటనను కొంత మంది వైసిపి నాయకులు స్వార్థ ప్రయోజనాల కోసం చింతమనేని ప్రభాకర్‌పై అసత్య ప్రచారాలు చేశారని, తమకు, చింతమనేని ప్రభాకర్‌కు మంచి సంబంధాలున్నాయని, ఇటీవల జరిగిన ఘటన విషయంలో కొంతమంది వైసిపి నాయకులు వచ్చి ఆయనపై కేసుపెట్టు అని తమపై ఒత్తిడి చేశారని, చేయని విషయానికి, అనని మాటలకు తామెలా కేసు పెడతామని ప్రశ్నించారు. దీంతో వారి మాట వినలేదని మొదుగుమూడి రాజశేఖర్ అనే గౌడ సమితి నాయకులు, మరి కొంతమంది గౌడ నాయకులు కలిసి తమ కుటుంబాన్ని వెలి వేయాలని, తమను ఏ శుభకార్యాలకూ పిలవొద్దని ఇబ్బంది పెడుతున్నారని తెలిపారు. తమకు పిల్లలున్నారని, సమాజంలో గౌరవం ఉందని, తమ మనోభాలను దెబ్బతీస్తూ ఇలా ప్రచారం చేసే వారిపై విచారణ చేసి క్రిమినల్ కేసులు పెట్టి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

మరోపక్క వైసిపికి చెందినదిగా భావిస్తున్న గౌడ జెఎసి ఆధ్వర్యంలో మరో సామాజిక తరగతికి ప్రజలు స్థానిక ఫైర్ స్టేషన్ సెంటర్ నుంచి ర్యాలీగా కలెక్టరేట్‌కు చేరుకుని అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జై గౌడ సేన జాతీయ అధ్యక్షులు ఏడుకొండలుగౌడ్, జవ్వాజి చంద్రశేఖర్, నంగడ రంగారావు, గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ మట్టా లక్ష్మి తదితరులు మాట్లాడుతూ ముందుగా దాడి జరిగిందని మీడియా ముఖంగా చెప్పిన లక్ష్మీనారాయణ తర్వాత దాడి జరగలేదని చెప్పడంలో అంతర్యమీమిటని ప్రశ్నించారు. చింతమనేని అనుచరులు బెదిరించారని, అందుకే లక్ష్మీనారాయణ భయపడి దాడి జరగలేదని చెబుతున్నారని ఆరోపించారు. గౌడ కులస్తులకు భద్రత కావాలని ఆయన అన్నారు. లక్ష్మీనారాయణ కుటుంబాన్ని వెలి వేయాలని ఎవరూ చెప్పలేదని, అదంతా కల్పన అని ఆయన అన్నారు. లక్ష్మీనారాయణ కుటుంబానికి అండగా తాము చేపట్టిన కార్యక్రమాన్ని భగ్నం చేయటానికి మరో గ్రూపు ఈ కార్యక్రమం చేపట్టిందని ఆయన తెలిపారు.

251.31 కోట్లతో 4 విద్యుత్ ఉపకేంద్రాలు

వర్చువల్‌గా ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనల చేసిన సిఎం జగన్

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లా పరిధిలో రూ.251.31 కోట్లతో నాలుగు విద్యుత్ ఉప కేంద్రాలకు సిఎం జగన్ విజయవాడ క్యాంపు కార్యాలయం నుండి వర్చువల్ విధానంలో మంగళవారం శంఖుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. పెదవేగి మండలం కొప్పాకలో రూ.139.66 కోట్ల వ్యయంతో 220/132/33 కెవి విద్యుత్ ఉపకేంద్రం నిర్మాణానికి ఎపి ట్రాన్స్ కో మంజూరు చేసిన విద్యుత్ ఉప కేంద్రానికి శంఖుస్థాపన, టి.నరసాపురంలో రూ.60.20 కోట్ల వ్యయంతో ద్వారకాతిరుమలలో రూ.28.89 కోట్ల వ్యయంతో, నారాయణపురంలో(నల్లమాడు)లో రూ.22.62 కోట్ల వ్యయంతో నిర్మించిన 132/33 కెవి విద్యుత్ ఉపకేంద్రాలను వర్చువల్ విధానంలో ప్రారంభోత్సవం చేశారు. కొప్పాక విద్యుత్ ఉప కేంద్రం శంఖుస్థాపనకు విచ్చేసిన జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ బి.లావణ్యవేణి, ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ గంటా పద్మశ్రీప్రసాద్‌తో కలిసి వర్చువల్ ద్వారా సిఎం శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం కోటగిరి మాట్లాడుతూ ఎంతో కాలంగా లోఓల్టేజీ సమస్యతో ఇబ్బంది పడుతున్న ప్రజానీకానికి విద్యుత్ ఉప కేంద్రాల ఏర్పాటు ద్వారా నాణ్యమైన విద్యుత్ పొందొచ్చున్నారు. ప్రధానంగా ఏలూరు జిల్లా వేగంగా అభివృద్ధి చెందుతుందని, పారిశ్రామిక రంగానికి మెరుగైన నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తున్నామని తెలిపారు. వ్యవసాయ రంగానికి పగటిపూట తొమ్మిది గంటల నాణ్యమైన నిరంతర విద్యుత్ అందుతుందని, గృహరంగానికి మెరుగైన విద్యుత్ పొందుతామని తెలిపారు. సిఎం జగన్ నవరత్నాల ద్వారా విద్యుత్ సబ్సిడీలను అందజేస్తుందని తెలిపారు. జెడ్‌పి చైర్‌పర్సన్ మాట్లాడుతూ సిఎం జగన్ సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకోవడంలో ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. ప్రజల ఆశయాలకనుగుణంగా పరిపాలన సాగిస్తున్నారని తెలిపారు. విద్యుత్ ఉప కేంద్రాల ద్వారా ప్రజలు ఎదుర్కొంటున్న లోఓల్టేజీ సమస్య, రైతుల సమస్యలు తీరబోతున్నాయని ఆమె తెలిపారు. జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ బి.లావణ్యవేణి మాట్లాడుతూ జిల్లాలో టి.నరసాపురం, ద్వారకాతిరుమల, నారాయణపురం మండలాల్లోని విద్యుత్ సమస్యను తీరబోతుందన్నారు. భీమడోలు, నూజివీడు, కామవరపుకోట, లైన్లు కలిపేందుకు కొప్పాక విద్యుత్ కేంద్రం నుండి డిసి లైన్లు కలుపుతామని తెలిపారు. కొప్పాక సబ్ స్టేషన్ ద్వారా రాబోయే రోజుల్లో ఏలూరు, పెదవేగి, పెదపాడు, దెందులూరు మండలాల్లో సుమారు నాలుగు లక్షల మంది విద్యుత్ వినియోగదారులకు లబ్ధిచేకూరుతుందని తెలిపారు. టి.నరసాపురం, చింతలపూడి, కామవరపుకోట మండలంలోని కొన్ని ప్రాంతాలు సుమారు రెండుల లక్షల విద్యుత్ వినియోగదారులకు లబ్ధిచేకూరుతుందన్నారు. ద్వారకాతిరుమల మండలం పెదవేగి, జంగారెడ్డిగూడెం, కామవరపుకోటలో 1.5 లక్షల మందికి లబ్ధి చేకూరుతుందన్నారు. ఉంగుటూరు మండలం నల్లజర్ల, భీమడోలు, నిడమర్రు మండలాల్లోని సుమారు రెండు లక్షల మంది విద్యుత్ వినియోగదారులకు లబ్ధిచేకూరుతుందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎపిఇపిడిసిఎల్ ఎస్ఇ సాల్మన్‌రాజు, సర్పంచి, జెడ్‌పిటిసి, ఎంపిటిసిలు, విద్యుత్ శాఖ ఎడిలు, డిఇలు, ఎఇలు, విద్యుత్ సిబ్బంది, ప్రజా ప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

ద్వారకాతిరుమల:మండలంలోని వెంకటకృష్ణాపురంలో నూతనంగా ఏర్పాటు చేసిన 132/33 విద్యుత్ సబ్‌స్టేషన్‌ను సిఎం జగన్ వర్చువల్‌గా మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న గోపాలపురం ఎంఎల్ఎ తలారి వెంకట్రావు మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధికి సిఎం జనగ్ నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. ఎన్ని అవాంతరాలు ఎదురైనా సంక్షేమ పథకాలను అమలు చేసిన ఘనత జగన్‌కే దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు, విద్యుత్ అధికారులు పాల్గొన్నారు.

కైకలూరుకు సామాజిక సాధికార బస్సుయాత్ర

కైకలూరు :వైసిపి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సామాజిక సాధికార బస్సు యాత్ర మంగళవారం కైకలూరు చేరుకుంది. ఈ యాత్రకు స్థానిక ప్రజలు స్వాగతంపలికారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు మాట్లాడుతూ బిసి, ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీ, ఒసిల్లో నిరుపేదలను కుటుంబ సభ్యులుగా భావించిన సిఎం జగన్ రాష్ట్రంలో ఉన్న పేదలకు జగనన్న అండగా ఉండి సంక్షేమ పథకాలు అందించారన్నారు. రెండేళ్లు కోవిడ్ ఉన్నా ఏ సంక్షేమ పథకాన్నీ ఆపకుండా ప్రజలకు అందించిన ఘనత జగన్‌దేనని కొనియాడారు. కైకలూరులో 15 వేల ఇంటి స్థలాలిచ్చారన్నారు. నియోజకవర్గంలో ఎన్నడూ లేని విధంగా రూ.746 కోట్లు అందించిన ఘనత జగన్‌దేనన్నారు. మంత్రి కారుమూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ మేనిఫెస్టోలో చెప్పినవి, చెప్పనివి కూడా అమలు చేస్తున్నామన్నారు. జయమంగళ వెంకటరమణకు చంద్రబాబు ఎంఎల్ఎ టికెట్ ఇస్తానని మోసం చేసి తన సామాజిక తరగతికి ఇచ్చుకున్నారన్నారు. అన్యాయం జరిగిన చోట న్యాయం చేయాలనే ఉద్దేశంతో ఇవాళ జగనన్న ఆయనను ఎంఎల్‌సిని చేశారన్నారు. మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ బిసిలు, ఎస్‌సిలు, ఎస్‌టిలు, మైనార్టీలు, అందరూ జగనన్న పక్షాన ఉన్నారన్నారు. మరో మంత్రి విడదల రజని మాట్లాడుతూ చంద్రబాబు ప్రభుత్వంలో ఎస్‌సిలు, ఎస్‌టిలకు సంబంధించి వాళ్ల కాలనీలు ప్రత్యేకంగా ఉండేవని, అది సామాజిక అంటరానితనమని పేర్కొన్నారు. జగనన్న వచ్చాక అందరికీ కలిపి జగనన్న కాలనీల్లో ఒకే దగ్గర ఉంచుతున్నారన్నారు. ఎంపీ మోపిదేవి వెంకటరమణ మాట్లాడుతూ జగనన్న పరిపాలనలో సామాజిక సాధికారత సాధించామన్నారు. అంబేద్కర్, పూలే కలలను సాకారం చేసిన ఏకైక సిఎం జగన్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ పిల్లి సుభాష్ చంద్రబోస్, ఉప్పాల హారిక పాల్గొన్నారు.

జగనన్న ఇళ్లు వేగవంతం

ఏలూరు:జగనన్న ఇళ్ల నిర్మాణ ప్రగతిని వేగవంతం చేయాలని గృహ నిర్మాణ శాఖ జిల్లా మేనేజర్ కె.రవికుమార్ అధికారులను ఆదేశించారు. జగనన్న ఇళ్ల నిర్మాణ ప్రగతి తీరుపై తహశీల్దార్లు, ఎంపిడిఒలు, గృహ నిర్మాణ శాఖ ఇంజనీర్లతో మంగళవారం కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశపు హాలులో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ జగనన్న ఇళ్ల పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తుందని, జిల్లాలో జగనన్న ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేసేందుక వచ్చేనెల ఒకటో తేదీ నుంచి 2024 జనవరి 30వ తేదీవరకూ 60 రోజులపాటు ప్రత్యేకంగా 'మెగా కంప్లీషన్ డ్రైవ్‌ను నిర్వహిస్తామన్నారు. ఈ డ్రైవ్‌లో ఇప్పటికే ప్రారంభించిన 21 వేల ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు.

బీమా నగదును అందజేస్తున్న ఎం.శ్రీనివాసరావు, సిహెచ్.పుల్లారావు

బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి జ్యోతిరావు పూలే

భీమడోలులో జ్యోతిరావు పూలే కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు

ప్రజాశక్తి - భీమడోలు

బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి, విద్యాభివృద్ధికి కృషి చేసన మహనీయుడు మహాత్మా జ్యోతిరావు పూలే అని గుండుగొలను గ్రామపంచాయతీ ఉపసర్పంచి, వైసిపి గ్రామ అధ్యక్షులు ముదుండి సూర్యనారాయణ రాజు తెలిపారు. గుండుగొలను సంతపేట సమీపంలో ఏర్పాటు చేసిన జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద ఉంగుటూరు నియోజకవర్గ స్థాయిలో మంగళవారం పూలే వర్ధంతి కార్యక్రమాన్ని ఉపసర్పంచి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా భీమడోలు సర్పంచి పి.సునీత మాన్సింగ్, ఎఎంసి ఛైర్‌పర్సన్ ఇంజేటి నీలిమ, భీమడోలు సొసైటీ అధ్యక్షులు ఆర్.సత్య శ్రీనివాస్, చైతన్య యువజన సంఘం ఛైర్మన్ డాక్టర్ పి.మాన్సింగ్, టిడిపి నాయకులు ఎస్.కొండబాబు, బిసి.నాయకులు పి.సత్యనారాయణ, వైసిపి గ్రామ సచివాలయాల కన్వీనర్ జి.మురళీ, సామాజిక కార్యకర్త టి.సుమన్ బాబు, వగ్వాల అచ్యుతరామయ్య పూలే జీవిత విశేషాలు వివరిస్తూ ప్రసంగించారు. అనంతరం ప్రముఖులు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి సత్కరించారు. ఈ సందర్భంగా గ్రామ ఉప సర్పంచి మాట్లాడుతూ రాజకీయాలకతీతంగా, కులమత బేధాలకు తావు లేకుండా గ్రామస్తులందరూ కలిసి పూలే కార్యక్రమాలను నిర్వహించటం అభినందనీయమన్నారు. ఆయన ఆశయం మేరకు బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి అందరూ తమ వంతు సహకరించాలని కోరారు.

చింతలపూడి: మహాత్మ జ్యోతిరావు పూలే బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతిగా, దేశంలోనే అంటరానితనంను ఎదిరించిన మొట్టమొదటి సంఘసంస్కర్తగా, వితంతు వివాహాలు వంటి అనేక స్త్రీ జనోద్ధరణ కార్యక్రమాలు చేపట్టారని సాధికార సమితి జిల్లా కన్వీనర్ కొప్పెర్ల నాగరాజు కొనియాడారు. పూలే 134వ వర్ధంతి సందర్భంగా ప్రగడవరం గ్రామంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి కొనకల్ల వీర్రాజు పాల్గొన్నారు.

ఏలూరు అర్బన్: మహాత్మా పూలే 134వ వర్ధంతి కార్యక్రమాన్ని మంగళవారం ఏలూరు కొత్త రోడ్‌లోని నవసమాజ్ సొసైటీ కార్యాలయంలో దళిత, బహుజన నాయకులు నేతల రమేష్ బాబు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత తపాలా ఎస్‌సి, ఎస్‌టి ఉద్యోగుల సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు నాగేంద్ర కుమార్ పాల్గొన్నారు.

చాట్రాయి: చిన్నంపేట గ్రామంలో అంబేద్కర్ సెంటర్ వద్ద వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మహాత్మ జ్యోతిరావు పూలే వర్ధంతి మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఉపాధి హామీ టిఎకె.జోషి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి కొమ్ము ఆనందం మాట్లాడుతూ పూలే బడుగు, బలహీన వర్గాల, దళిత, గిరిజన వర్గాల ఐక్యత కోసం నిరంతరం కృషి చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొమ్ము నాగేశ్వరరావు, తేలూరి ప్రసాదు, యువకులు పాల్గొన్నారు.

ఏలూరు టౌన్: పూలే ఆశయ సాధనకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని ఐఆర్‌ఎస్ అధికారి చాగంటి సంజీవ్ పిలుపునిచ్చారు. మంగళవారం ఉదయం 11 గంటలకు ఏలూరు కొత్త రోడ్‌లోని నవసమాజ్ సొసైటీ కార్యాలయంలో సీనియర్ దళిత బహుజన నాయకులు నేతల రమేష్ బాబు అధ్యక్షతన మహాత్మా పూలే 134వ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బందిలి భీమరాజు, భూపతి అప్పారావు, ఎల్ఐసి రాజా పాల్గొన్నారు.

ముదినేపల్లి: పూలే వర్ధంతి మంగళవారం ముదినేపల్లిలో విగ్రహ నిర్మాణ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా విగ్రహ నిర్మాణ కమిటీ సభ్యులు జ్యోతిరావు పూలేకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో విగ్రహ నిర్మాణ కమిటీ గౌరవ అధ్యక్షులు పడమట వెంకటరమణ, గౌరవ కార్యదర్శి నిమ్మగడ్డ బిక్షాలు, ముదినేపల్లి గ్రామ సర్పంచి నిమ్మగడ్డ కైకమ్మ పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ వైఎస్ఆర్ బీమాలో చేరాలి

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

పేదలపాలిట వైఎస్ఆర్ బీమా పథకం వరమని ప్రతి ఒక్కరూ బీమా పథకంలో సభ్యులుగా చేరాలని బొద్దనపల్లి వైసిపి గ్రామ అధ్యక్షులు మల్లవల్లి శ్రీనివాసరావు అన్నారు. మండల పరిధిలోని బొద్దనపల్లి గ్రామ పంచాయతీ శివారు శోభనాపురం గ్రామానికి చెందిన బళ్ల శ్రీనివాసరావు గుండెపోటుతో మృతి చెందడంతో అతని భార్య బళ్ల రాధికకు మట్టి ఖర్చుల క్రింద రూ.10 వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు డి.వెంకట రామారావు, బి.శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి సిహెచ్.పుల్లారావు, వేల్ఫేర్ అసిస్టెంట్ మహేష్ పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌గా తీర్చిదిద్దేందుకు కృషి

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

నూజివీడు పట్టణంలోని జెడ్‌పి గర్ల్స్ హైస్కూల్‌ను మోడల్ స్కూల్‌గా తీర్చిదిద్దేందుకు దాతల సహకారంతో ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తానని పాఠశాల ప్రధానోపాధ్యాయులు వివిఎన్.సత్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన మాట్లాడుతూ దాత విశ్వనాథరావు రూ.4 లక్షల విలువైన 5 కెవి సోలార్ పరికరాలను వితరణగా అందించినట్లు తెలిపారు. అందరి సహకారంతో మోడల్ స్కూల్‌గా తీర్చిదిద్దుతామని తెలిపారు.

వ్యాయామంతో ఆరోగ్యం

ప్రజాశక్తి - ముసునూరు

ప్రత్యేక అవసరాల గల విద్యార్థులు ప్రతిరోజు వ్యాయామం చేసినట్లయితే ఆరోగ్యకరంగా ఉంటారని ఫిజియోథెరఫిస్టు జి.ప్రశాంతి పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రమైన ముసునూరు ప్రాథమిక పాఠశాల భవిత సెంటర్‌లో ఫిజియోథెరపీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎం.అన్నామణి, ఉపాధ్యాయులు డిఎంపిఎల్ నారాయణ రావు, జె.నాగమల్లేశ్వరి పాల్గొన్నారు.

వైభవంగా లక్ష దీపోత్సవం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

స్థానిక నూకాలమ్మ ఆలయంలో కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని నిర్వహించిన లక్ష దీపోత్సవ కార్యక్రమం వైభవంగా జరిగింది. ఆలయ ప్రాంగణంలో పలువురు మహిళలు అలంకరించిన దీపాలంకరణలు ఆకట్టుకున్నాయి. ఈక్రమంలో ఆలయ కమిటీ ఛైర్మన్ డాక్టర్ రాజాన సత్యనారాయణ, రామలక్ష్మీ దంపతులు మున్సిపల్ కమిషనర్ భవాని ప్రసాద్, జ్యోతి దంపతుల చేతుల మీదుగా దీపోత్సవాన్ని ప్రారంభించారు. అలాగే బాణసంచా పలువురిని ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు, ఆలయ కమిటీ సభ్యులు, శ్రీనూకాంబిక సేవా బృందం సభ్యులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ విధి విధానాలపై అవగాహన

ప్రజాశక్తి - టి.నరసాపురం

గ్రామ పంచాయతీ విధి విధానాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి వుండాలని ఎంపిడిఒ మంగాకుమారి తెలిపారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో మంగళవారం పంచాయతీ విస్తరణ అధికారి ఎం.రాంప్రసాద్ అధ్యక్షతన పంచాయతీ విధానాలపై ప్రజా ప్రతినిధులు, అధికారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మంగాకుమారి మాట్లాడుతూ గ్రామ పరిపాలనపై పంచాయతీ రాజ్ 1994 చట్టం ప్రకారం సెక్షన్లు, రూల్స్, రికార్డు కస్టోడియన్ విధి విధానాల అమలు తీరుపై అవగాహన అవసరమని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు, ఎంపిటిసిలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నేడు వికసిత్ భారత్ సంకల్పయాత్ర

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో ఈనెల 29వ తేదీ బుధవారం వివిధ మండలాల్లో నిర్వహించే వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమ వివరాలను జిల్లా పంచాయతీ అధికారి తూతిక శ్రీనివాస విశ్వనాధ్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతిరోజు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు షెడ్యూల్లో తెలిపిన గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్పయాత్ర ప్రచార కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ యాత్రలో కేంద్ర ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను తెలియజెప్పడంతో పాటు, ఇప్పటికే లబ్ధి పొందిన వారి నుంచి అభిప్రాయ సేకరణ తీసుకుంటామన్నారు. అలాగే అర్హులైన లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించి రుణాల మంజూరుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

యాత్ర వివరాలు: బుధవారం భీమడోలు మండలం దుద్దేపూడి(ఉదయం), కోడురుపాడు(మధ్యాహ్నం), దెందులూరు మండలం జోగన్నపాలెం (ఉదయం), గాలయగూడెం(మధ్యాహ్నం), ద్వారకాతిరుమల మండలం కొమ్మర(ఉదయం), రాళ్లకుంట(మధ్యాహ్నం), కామవరపుకోట మండలం యడవల్లి (ఉదయం), రావికంపాడు(మధ్యాహ్నం), ముదినేపల్లి మండలం బొమ్మినంపాడు(ఉదయం), అళ్లురు(మధ్యాహ్నం) నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని స్థానిక ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆ ప్రకటనలో జిల్లా పంచాయతీ అధికారి కోరారు.

ముసునూరులో 'భవిష్యత్తుకు గ్యారెంటీ'

ప్రజాశక్తి - ముసునూరు

దళిత, గిరిజన ఓట్లతో అధికారాన్ని చేజెక్కించుకున్న వాళ్లు పథకం ప్రకారం ఎస్‌సి, ఎస్‌టిల రక్షణ చట్టాలను, సంక్షేమాభివృద్ధి పథకాలను నిర్వీర్యం చేస్తున్నారని నూజివీడు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ముద్దరబోయిన వెంకటేశ్వరరావు అన్నారు. ముసునూరులో 'బాబు ష్యూరిటీ–భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌సి, ఎస్‌టిలకు సంబంధించి 27 పథకాల్ని రద్దు చేయడాన్ని ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. వైసిపి అమలు చేస్తోన్న నవరత్నాల్లో అత్యధిక లబ్ధిదారులు ఎస్‌సి, ఎస్‌టిలేనని కాబట్టి ఈ ప్రత్యేక పథకాల అవసరం ఇప్పుడు లేదని చెప్పున్నారని అన్నారు. ఒక్క గది ఉన్న ఇంటికి సైతం పూరి పాకలైనా సరే వేలకు వేలు విద్యుత్ బిల్లులు వస్తున్నాయి అంటూ స్థానికులు ముద్దరబోయిన దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై ముద్దరబోయిన ఆగ్రహం వ్యక్తం చేస్తూ పేదల పక్షాన విద్యుత్ సంస్థలపై కోర్టుకు వెళతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ గద్దె రఘుబాబు, సర్పంచి కొండేటి విజయలక్ష్మి బాబి, గ్రామ పార్టీ అధ్యక్షులు పాకనాటి ఆంజనేయులు, సర్పంచులు గద్దల సుహాసిని మేహనరావు పాల్గొన్నారు.

అంబేద్కర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి

ముదినేపల్లి: అంబేద్కర్ ఆశయాలను ముందుకు తీసుకు వెళ్లేందుకు దళితులు నడుం బిగించాలని స్నేహ స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్ కె.నిరీక్షణ రావు కోరారు. ముదినేపల్లిలో అలేఖ్య ప్లాట్స్‌లో మాల మహానాడు, అనుబంధ సంస్థల రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ సేవ నాగ జగన్ బాబురావు ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన నిరీక్షణ రావు మాట్లాడుతూ కుల,మత బేధం లేకుండా అన్ని కులాల వారిని ఐక్యం చేసే ఈ ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సేవ రాజ్ కుమార్ పి.ప్రతాప్, ఏసుపోగు దానియేలు, జక్కుల విజయకుమార్ హాజరైయ్యారు.

అక్రమంగా తరలిస్తున్న నాటుసారా స్వాధీనం

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

అక్రమంగా నాటుసారా తరలిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వి.చంద్ర శేఖర్ తెలిపారు. మండలంలోని తాటియాకుల గూడెం చెక్‌పోస్ట్ వద్ద మంగళవారం సాయంత్రం వాహనాల తనిఖీ చేస్తుండగా ఈగల వెంకటరత్నం వద్ద ఉన్న సంచిలో నాటుసారా పెట్టుకొని నడుచుకుంటూ వస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. నాటుసారాను స్వాధీనం చేసుకుని ఆ వ్యక్తిని అదుపులోకి తీసుకొన్నట్లు తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

గోద్రేజ్ ఆవరణలో డ్రైవర్ మృతి

ప్రజాశక్తి - చింతలపూడి

వ్యాన్ అదుపుతప్పి డ్రైవర్ మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సీతానగరం గోద్రేజ్ పామాయిల్ ఫ్యాక్టరీలో ఏలూరుకి చెందిన పల్లి సుందరరాజు(66) డిసియం వ్యాన్‌లో ఇటుకలు తీసుకువెళ్లాడు. ఫ్యాక్టరీ ఆవరణలో వాహనం ఆపి రశీదు కోసం వెళ్లగా డిసిఎం వ్యాన్ అదుపుతప్పి వెనుకకు వెళుతుండటంతో వ్యాన్ వద్దకు వెళ్లి ఆపటానికి ప్రయత్నించాడు. ఈ క్రమంలో వెనుకనున్న ట్రాక్టర్‌కి వ్యాన్‌కి మధ్యలో నలిగిపోవటంతో ఫ్యాక్టరీ సిబ్బంది చింతలపూడి హస్పటల్‌కి తీసుకువస్తుండగా దారిలో మరణించినట్లు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మృతుని కుటుంబానికి నష్టపరిహారం ఇవ్వాలి : సిఐటియు

గోద్రెజ్ ఫ్యాక్టరీ ఆవరణలో చనిపోయిన లారీ డ్రైవర్ కుటుంబాన్ని ఆదుకోవాలని సిఐటియు మండల అధ్యక్షులు నత్త వెంకటేశ్వరావు, కార్యదర్శులు బాలరాజు, ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌ఫోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా నాయకుడు గోపి అన్నారు. రవాణా రంగంలో ఉన్నటువంటి డ్రైవర్లకు ప్రాణ భద్రత లేకుండా పోతుందని, అరకొర జీతాలతో పనిచేసే లారీ డ్రైవర్లు, క్లీనర్లుకు ఇటువంటి ప్రమాదాలు జరగడం వలన వారిపై ఆధారపడి జీవించే కుటుంబాలు అనాథలుగా మిగిలిపోవాల్సినటువంటి పరిస్థితి ఏర్పడుతుందని తెలిపారు. చనిపోయిన లారీ డ్రైవర్ కుటుంబానికి కార్మిక చట్టాల ప్రకారం రావల్సిన నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు.

లబ్ధిదారులకు నిత్యావసరాలు పంపిణీ చేయాలి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

జిల్లాలో రైస్‌కార్డు లబ్ధిదారులకు కొన్ని నెలలపాటు కందిపప్పు, నూనె పంపిణీ చేయడం లేదని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ విమర్శించింది. మంగళవారం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.జీవరత్నం, పి.రామకృష్ణలు ఈ మేరకు పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ రైస్‌కార్డు లబ్ధిదారులకు తక్షణమే కందిపప్పు, నూనె పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. బయట మార్కెట్‌లో కేజీ రూ.170 నుంచి రూ.200ల మధ్య ధర పలుకుతున్న కందిపప్పును పేదలు కొనుగోలు చేయలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పేదలకు పంపిణీ చేయాల్సిన కందిపప్పును ప్రభుత్వం పంపిణీ చేయకపోవడంతో అధిక ధరలకు కొనుగోలు చేయలేక ప్రజలు పోషకాహారానికి దూరమౌతున్నారని మండిపడ్డారు. తమది సంక్షేమ ప్రభుత్వమని చెప్పుకుంటున్న వైసిపి నేతలు 3 నెలలకు పైగా కందిపప్పు పంపిణీ చేయలేకపోతున్నా కనీసం స్పందించకపోవడం అన్యాయమన్నారు. పెరుగుతున్న ధరలను ప్రభుత్వం పరిగణలోకి తీసుకొని రేషన్ డిపోల ద్వారా నిత్యావసర సరుకులు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. కేరళలో వామపక్ష ప్రభుత్వం 14 రకాల నిత్యావసర సరుకులు ప్రజలకు పంపిణీ చేస్తుందని తెలిపారు. ఆ తరహాలో మన రాష్ట్రంలో కూడా రేషన్ డిపోల ద్వారా నిత్యావసర సరుకులు సరఫరా చేసి పేదలను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

నేడు నారాయణపురం కాలేజీలో కరాటే పోటీలు

ప్రజాశక్తి - ఉంగుటూరు

నారాయణపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ అంతర కళాశాలల పురుషులు, మహిళల కరాటే పోటీలు ఈనెల 29 న జరుగుతాయని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టికె.విశ్వేశ్వరరావు తెలియజేశారు. పోటీలకు సంబంధించిన కరపత్రాన్ని ఏలూరు ఆర్‌డిఒ ఎస్‌కెఎన్.ఖాజావలీ, తహశీల్దార్, ఎంపిడిఒ, అధ్యాపక సిబ్బంది మంగళవారం కళాశాలలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ మాట్లాడుతూ కరాటే పోటీలు విద్యార్థుల శారీరక, మానసిక ఉన్నతికి తోడ్పడతాయని, స్వీయ రక్షణకు కరాటే మారుపేరని అన్నారు. పోటీల ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ రాజా మేరిసన్ బాబు మాట్లాడుతూ 29న పోటీలతో పాటు ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ కరాటే మహిళ, పురుషుల జట్ల ఎంపిక జరుగుతుందని, ఎంపిక చేసిన పురుషుల జట్టు భోపాల్ యూనివర్సిటీలో డిసెంబర్ 5వ తేదీన జరిగే సౌత్ జోనల్ యూనివర్శిటీ టోర్నమెంట్‌లో, మహిళల జట్టు ఢిల్లీలో జరిగే పోటీలలో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం తరపున పాల్గొంటారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పాత్రికేయులకు సామాజిక బాధ్యత మెండు

ఎపిడబ్ల్యూజెఎఫ్ నేతలతో ఎంఎల్ఎ ఎలిజా

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

మీడియా అంటే తనకు ఎంతో గౌరవం అని, సామాజిక బాధ్యతతో పాత్రికేయులు పని చేస్తున్నారని ఎంఎల్ఎ ఎలిజా పేర్కొన్నారు. వచ్చేనెల మూడో తేదీన ఏలూరులో జరగనున్న ఎపి వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్(ఎపిడబ్ల్యూజెఎఫ్) ప్రథమ జిల్లా మహాసభకు విశిష్ట అతిథిగా విచ్చేయాల్సిందిగా చింతలపూడి ఎంఎల్ఎ ఎలిజాను ఫెడరేషన్ నాయకులు మంగళవారం ఆహ్వానించారు. ఏలూరు గిరిజన్ భవన్‌లో 3న ఉదయం 9 గంటలకు మహాసభ మొదలౌతుందని వివరించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ తాను తప్పక హాజరౌతానని హామీ ఇచ్చారు. అదేరోజు మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఆధ్వర్యంలో నిర్వహించు కార్యక్రమాన్ని మరో రోజుకు వాయిదా వేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వైసిపి సీనియర్ నాయకుడు బత్తిన చిన్న, పట్టణ వైసిపి అధ్యక్షుడు చిటికిన అచ్చిరాజు పాల్గొన్నారు.

లాభాలను అందించే 3082 వరి వంగడం

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

తక్కువ కాల పరిమితి, అతి తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడినిచ్చే వరి వంగడం 3082 అధిక లాభాలను అందిస్తుందని జిల్లా డాట్ సెంటర్ కోఆర్డినేటర్ డాక్టర్ సుజాత తెలిపారు. నూజివీడులో ప్రయోగాత్మకంగా రమేష్ అనే రైతు ఇదే వంగడాన్ని సాగు చేస్తూ ఉండగా వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు జి.విద్యాసాగర్ బృందంతో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుజాత మాట్లాడుతూ ప్రతి రైతు లాభాలు పొందే విధంగా ఈ వంగడాన్ని సాగు చేయాలని తెలిపారు.

పోణంగి పాఠశాలలో డిఇఒ ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

జిల్లా విద్యాశాఖాధికారి పులపర్తి శ్యాంసుందర్ మంగళవారం ఏలూరు రూరల్ మండలం ఎంపిపిఎస్ పోణంగి పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. సంగ్రహణాత్మక మదింపు పరీక్షలు జరుగుచున్న విధానాన్ని, అదేవిధంగా అన్ని తరగతుల సాధన బుక్స్, వర్క్ బుక్స్, కరెక్షన్, తరుల్ ప్రోగ్రాం ప్రోగ్రెస్ కార్డ్స్, విద్యార్థుల ప్రగతిని, టీచర్ అటెండెన్స్ ఆన్లైన్‌లో, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. తదనంతరం విద్యార్థులతో ఇంట్రాక్ట్ అయి విద్యార్థులు చెప్పిన సమాధానం బట్టి సంతృప్తి వ్యక్త పరచారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు కందుల రాంబాబు, ఉపాధ్యాయులు యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు షేక్ ముస్తఫా అలీ పాఠశాలకు దాతల సహకారంతో ప్రహరీ గోడ, గేటు, వెనకవైపు ఫెన్సింగ్, కంప్యూటర్స్, ప్రింటర్ మొదలైనవన్నీ సమకూర్చామని, పాఠశాల అభివృద్ధిలో తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు, ఏలూరు స్మార్ట్ సిటీ లయన్స్ క్లబ్ వారు విద్యార్థులకు నోట్స్‌లు, మౌలిక వసతులు కల్పిస్తున్నారని వివరించారు. పాఠశాల విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు పెంపొందించడంలో, పాఠశాల మౌలిక అభివృద్ధిలో ఉపాధ్యాయులు తీసుకున్న శ్రద్ధ శక్తుల పట్ల డిఇఒ హెచ్‌ఎం, ఉపాధ్యాయులను అభినందించారు.

ప్రతిఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - చాట్రాయి

అర్హత కలిగి 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులు ఓటర్లుగా నమోదు కావాలని, ఓటుహక్కు కలిగిన ప్రతిఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలని చాట్రాయి తహశీల్దార్ సిహెచ్.విశ్వనాథ రావు అన్నారు. చాట్రాయిలో మంగళవారం తహశీల్దార్ ఆధ్వర్యంలో కాలేజీ విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వికాస్ కాలేజీ ప్రిన్సిపల్ రామ్మోహన్ రెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ముసునూరు: ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని ట్రైనింగ్ డిప్యూటీ కలెక్టర్ శ్రీపూజ పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రమైన ముసునూరు తహశీల్దార్ కార్యాలయం నుంచి మండపం సెంటర్ వరకు ఓటు హక్కు వినియోగంపై అవగాహన ర్యాలీ తహశీల్దార్ దాసరి సుధా, ఎంపిడిఒ జి.రాణిల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి బసవరాజు అచ్యుత సత్యనారాయణ, ఎంపిడిఒ ఆఫీస్ ఎఒ కూచిపూడి సాయిరాం, సీనియర్ అసిస్టెంట్ ఎస్.శ్రీనివాసరావు, జూనియర్ అసిస్టెంట్ సన్నీ రాజన్, పంచాయతీ కార్యదర్శులు ఆరేపల్లి వెంకటేశ్వరరావు, స్రవంతి ప్రసాదులు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం: 18 సంవత్సరాల నిండిన యువతీ, యువకులు తప్పనిసరిగా ఓటు నమోదు చేసుకోవాలని చింతలపూడి నియోజకవర్గ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె.గీతాంజలి సూచించారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఓటర్ల నమోదుపై అవగాహన సదస్సు సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్, ఎలక్ట్రోరల్ పార్టిసిపేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ కె.స్లీవ జోజి, ఎలక్షన్ డిప్యూటీ తహశీల్దార్ శేఖర్ బాబు పాల్గొన్నారు

కష్టపడే తత్వాన్ని అలవర్చుకోవాలి

రెడ్‌క్రాస్ ఛైర్మన్ బివి.కృష్ణారెడ్డి

ఏలూరు అర్బన్: విద్యార్థి దశ నుంచే కష్టపడే తత్వాన్ని అలవర్చుకోవాలని, చదువుతోపాటు జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్ వంటి అంశాల మీద కూడా విషయ పరిజ్ఞానాన్ని పెంచుకోవాలని రెడ్‌క్రాస్ జిల్లా ఛైర్మన్ బివి.కృష్ణారెడ్డి సూచించారు. స్థానిక పత్తేబాద్‌లోని రెడ్‌క్రాస్ ఎఎన్ఎం నర్సింగ్ కళాశాలను మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా నూతనంగా వచ్చిన 27వ బ్యాచ్ విద్యార్థినులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. యూఎస్ఎ నుంచి వచ్చిన గుర్రాల బాల చిన్నపురెడ్డి, భవ్య రెడ్డిలు విద్యార్థినులకు పెన్నులు, పుస్తకాలను పంపిణీ చేశారు. అనంతరం భవ్య రెడ్డి మాట్లాడుతూ ఎఎన్ఎం కోర్స్ తర్వాత బిఎస్‌సి నర్సింగ్ చదువుకోవడానికి ఆసక్తి ఉన్న పేద విద్యార్థినీలను పూర్తి ఖర్చులతో చదివిస్తానన్నారు. గతంలో విద్యార్థినుల హాస్టల్‌కు కావలసిన ఐరన్ మంచాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నర్సింగ్ స్టాఫ్ జి.జ్ఞాన వేణి, సిహెచ్.అనూష, ఎ.సూర్యనారాయణ, వి.నాగరాజు, ఎండి.సుధీర్ పాల్గొన్నారు.

ఎన్‌సిసి క్యాడెట్లుగా నమోదు కావాలి

భీమడోలు: క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలున్న విద్యార్థులు ఎన్‌సిసి క్యాడెట్లుగా నమోదుకావాలని ఏలూరు ఆర్‌డిఒ ఎస్ఎస్‌కె.ఖాజావలి సూచించారు. భీమడోలు శ్రీవెంకటేశ్వర డిగ్రీ, జూనియర్ కళాశాలలో ఎన్‌సిసి విభాగం 19(ఎ) బెటాలియన్ ఆధ్వర్యంలో ఎన్‌సిసి క్యాంప్ నిర్వహిస్తున్నారు. కళాశాల స్థాయిలో ఎన్‌సిసి లెఫ్ట్‌నెంట్ ఎన్.శివశంకర్ ఆధ్వర్యంలో మంగళవారం ఎన్‌సిసి ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు. దీనిలో భాగంగా ఎన్‌సిసి క్యాడెట్ల భాగస్వామ్యంతో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన ఆర్‌డిఒ మాట్లాడుతూ విద్యార్థులు ఎన్‌సిసి క్యాడెట్లుగా చేరటం వల్ల విద్య, ఉపాధి అవకాశాల్లో రాయితీలు పొందొచ్చని తెలిపారు. సుమారు 25 మంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సిసి అధికారులు దేవేంద్ర లిండే, జితేంద్ర, పాల్గొన్నారు.

ప్రయోగశాలగా పాఠశాల విద్య : ఎపిటిఎఫ్

ప్రజాశక్తి - చింతలపూడి

ప్రభుత్వం పాఠశాల విద్యను ప్రయోగశాలగా మార్చిందని, దీనివలన మంచి ఫలితాల కంటే చెడు ఫలితాలే ఎక్కువగా వస్తున్నాయని ఎపిటిఎఫ్ జిల్లా శాఖ అధ్యక్షులు బి.రెడ్డి దొర అన్నారు. ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ మండల శాఖ సర్వసభ్య సమావేశం యం.రవికుమార్ అధ్యక్షతన స్థానిక మేడబడి పాఠశాలలో మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోధన కంటే బోధనేతర పనులకు ఎక్కువ సమయం కేటాయించవలసి వస్తుందన్నారు. జిఒ నెంబర్ 117 విద్యారంగానికి గొడ్డలిపెట్టు వంటిదని, దీనివలన ప్రభుత్వ పాఠశాలలు నిర్వీర్యం అవుతున్నాయన్నారు. అనంతరం చింతలపూడి మండల శాఖ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. మండల అధ్యక్షులుగా భూక్య నాగేశ్వరావు, ప్రధాన కార్యదర్శిగా మారుమూడి రవికుమార్, ఉపాధ్యక్షులుగా జె.వెంకట్రామిరెడ్డి, ఎంఎస్.శాంతకుమారి, కార్యదర్శులుగా డి.రామకృష్ణ పి.చాంద్ ఖాను, ఎస్.స్వరూప రాణి, ఆడిట్ కన్వీనర్‌గా నక్క రాంబాబు, కో కన్వీనర్లుగా ఎం.తిరుపతిరావు, వి.రామకృష్ణ, జిల్లా కౌన్సిలర్‌గా ఉమామహేశ్వర రావు వీరిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశానికి ఎపిటిఎఫ్ సీనియర్ కార్యకర్తలు మిరియాల శేఖర్, తూము రమేష్ బాబు, ఎన్.ఆనంద్ బాబు, బి.శేఖర్ హాజరైయ్యారు.

మహారాజశ్రీ ఏలూరు అదనపు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

ఇ.పి. నెం. 148/2013 ఇన్ ఓ.ఎస్. నెం. 81/2007

బిట్వీన్:
పువ్వాడ రామాంజనేయులు (డైడ్) -డిక్రీ హోల్డర్ అండ్ వగైరా
మరియు
చిట్లూరి పురుషోత్తం (డైడ్), వగైరా -జడ్జిమెంట్ డెటార్సు

పై నెంబరు దాఖలా వారంటు గ్రంథములో డిక్రీ బాకీ వసూలు నిమిత్తం ఈ దిగువ ఇ.పి. షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని పై కోర్టులో **ది. 14-12-2023వ తేదీన ఉదయం గం॥ 10.30లకు** బహిరంగంగా వేలం వేయుదురు. కావలసిన వారు సదరు వేలంలో పాల్గొని పాడుకొనవచ్చును.

వాది తరపు దాఖలు చేసిన ఇ.పి. షెడ్యూలు దాఖలా ఆస్తి

పశ్చిమగోదావరి జిల్లా, చింతలపూడి మండలం, చింతలపూడి సబ్ రిజిష్ట్రీ, చింతలపూడి గ్రామ కంఠం, ఆర్.యస్. నెం. 913/1ఎ రు దాఖలా మొత్తము చ॥గ॥ 1118-2లు స్థలము మరియు డోరు నెం. 8-45రు అసెస్‌మెంట్ నెం. 1006, 1007 మరియు అందులో గల పంచాయితీ అసెస్‌మెంట్ నెం. 3901రు గల రేకుల షెడ్డు వగైరా క్రింద తెలిపిన 7 అయిటమ్ ఆస్తికి హద్దులు:

ఐటమ్ నెం.1: పశ్చిమగోదావరి జిల్లా, చింతలపూడి మండలం, చింతలపూడి సబ్ రిజిస్ట్రారు యిలాకా, చింతలపూడి గ్రామ కంఠంలో ఆర్.యస్. నెం. 913/1ఎ రు దాఖలా య. 15-98ట్లులో గురుభట్లగూడెం రోడ్డుకు ఉత్తరము వైపున గల చ॥గ॥ 134-0-0లు ఖాళీ స్థలమునకు హద్దులు: **తూర్పు:** కొనకళ్ళ సాయిబాబా వగైరాలు మరియు సత్రం స్థలము అ. 32-7లు. **దక్షిణం:** గురుభట్లగూడెం రోడ్డు అ. 39-5లు. **పడమర:** పంచాయితీ రోడ్డు అ. 30-0లు. **ఉత్తరం:** ఐటమ్ నెం.2రు దాఖలా స్థలం అ. 37-8లు.
అమీనా కిమ్మత్తు: రూ. 10,72,000/-లు

ఐటమ్ నెం.2: పశ్చిమగోదావరి జిల్లా, చింతలపూడి మండలం, చింతలపూడి సబ్ రిజిస్ట్రారు యిలాకా, చింతలపూడి గ్రామ కంఠంలో ఆర్.యస్ నెం. 913/1ఎ రు దాఖలా య. 15-98ట్లులో గురుభట్లగూడెం రోడ్డుకు ఉత్తరము వైపున గల చ॥గ॥ 117-2-0లు ఖాళీ స్థలమునకు హద్దులు: **తూర్పు:** కొనకళ్ళ సాయిబాబా వగైరాలు మరియు సత్రం స్థలము అ. 32-7లు. **దక్షిణం:** ఐటమ్ నెం.1 దాఖలా కొనకళ్ళ సాయిబాబా వగైరాలు మరియు సత్రం స్థలము అ. 58-6లు. **పడమర:** పంచాయితీ రోడ్డు అ. 18-7లు. **ఉత్తరం:** ఐటమ్ నెం.3రు దాఖలా స్థలం అ. 58-3లు.
అమీనా కిమ్మత్తు: రూ. 9,37,600/-లు

ఐటమ్ నెం.3: పశ్చిమగోదావరి జిల్లా, చింతలపూడి మండలం, చింతలపూడి సబ్ రిజిస్ట్రారు యిలాకా, చింతలపూడి గ్రామ కంఠంలో ఆర్.యస్. నెం. 913/1ఎ రు దాఖలా య. 15-98ట్లులో గురుభట్లగూడెం రోడ్డుకు ఉత్తరము వైపున గల చ॥గ॥ 189-3-0లు ఖాళీ స్థలమునకు హద్దులు: **తూర్పు:** చిట్లూరి నారాయణరావు గారి స్థలం అ. 23-8లు. **దక్షిణం:** ఐటమ్ నెం.2రు దాఖలా స్థలం అ. 58-3లు. **పడమర:** పంచాయితీ రోడ్డు అ. 30-4లు. **ఉత్తరం:** ఐటమ్ నెం.4రు దాఖలా స్థలం అ. 68-0లు.
అమీనా కిమ్మత్తు: రూ. 15,14,400/-

ఐటమ్ నెం.4: పశ్చిమగోదావరి జిల్లా, చింతలపూడి మండలం, చింతలపూడి సబ్ రిజిస్ట్రారు యిలాకా, చింతలపూడి గ్రామ కంఠంలో ఆర్.యస్. నెం. 913/1ఎ రు దాఖలా య. 15-98ట్లులో గురుభట్లగూడెం రోడ్డుకు ఉత్తరము వైపున గల చ॥గ॥ 157-7-0లు ఖాళీ స్థలమునకు హద్దులు: **తూర్పు:** చిట్లూరి చలపతిరావు గారి స్థలం అ. 25-1లు. **దక్షిణం:** ఐటమ్ నెం. 3రు దాఖలా స్థలం అ. 68-0లు. **పడమర:** పంచాయితీ రోడ్డు అ. 15-6లు. **ఉత్తరం:** ఐటమ్ నెం.5రు దాఖలా స్థలం (ఐటమ్ నెం.5, 41.3లు మరియు చిట్లూరి చలపతిరావు గారి స్థలం అ. 30.9లు) అ. 72-0లు.
అమీనా కిమ్మత్తు: రూ. 12,61,600/-

ఐటమ్ నెం.5: పశ్చిమగోదావరి జిల్లా, చింతలపూడి మండలం, చింతలపూడి సబ్ రిజిస్ట్రారు యిలాకా, చింతలపూడి గ్రామ కంఠంలో ఆర్.యస్. నెం. 913/1ఎ రు దాఖలా య. 15-98ట్లులో గురుభట్లగూడెం రోడ్డుకు ఉత్తరము వైపున గల చ॥గ॥ 182-0-0లు ఖాళీ స్థలమునకు హద్దులు: **తూర్పు:** చిట్లూరి చలపతిరావు గారి స్థలం అ. 35-0లు. **దక్షిణం:** ఐటమ్ నెం. 4రు దాఖలా స్థలం అ. 41-3లు. **పడమర:** పంచాయితీ రోడ్డు అ. 34-11లు. **ఉత్తరం:** ఐటమ్ నెం.6రు దాఖలా స్థలం అ. 52-5లు.
అమీనా కిమ్మత్తు: రూ. 14,56,000/-

ఐటమ్ నెం.6: పశ్చిమగోదావరి జిల్లా, చింతలపూడి మండలం, చింతలపూడి సబ్ రిజిస్ట్రారు యిలాకా, చింతలపూడి గ్రామ కంఠంలో ఆర్.యస్. నెం. 913/1ఎ రు దాఖలా య. 15-98ట్లులో గురుభట్లగూడెం రోడ్డుకు ఉత్తరము వైపున గల చ॥గ॥ 187-1-0లు ఖాళీ స్థలమునకు హద్దులు: **తూర్పు:** చిట్లూరి చలపతిరావు గారి స్థలం అ. 26-5లు. **దక్షిణం:** ఐటమ్ నెం.5 రు దాఖలా స్థలం అ. 52-5లు. **పడమర:** పులిపాటి చక్రధరరావు వగైరాల స్థలం అ. 40-10లు. **ఉత్తరం:** ఐటమ్ నెం. 7రు దాఖలా స్థలం అ. 47-9లు.
అమీనా కిమ్మత్తు: రూ. 14,96,800/-

ఐటమ్ నెం.7: పశ్చిమగోదావరి జిల్లా, చింతలపూడి మండలం, చింతలపూడి సబ్ రిజిస్ట్రారు యిలాకా, చింతలపూడి గ్రామ కంఠంలో ఆర్.యస్. నెం. 913/1ఎ రు దాఖలా య. 15-98ట్లులో గురుభట్లగూడెం రోడ్డుకు ఉత్తరము వైపున గల చ॥గ॥ 150-5-0లు ఖాళీ స్థలమునకు హద్దులు: **తూర్పు:** చిట్లూరి చలపతిరావు గారి స్థలం అ. 34-9లు. **దక్షిణం:** ఐటమ్ నెం. 6రు దాఖలా స్థలం అ. 47-9లు. **పడమర:** పులిపాటి చక్రధరరావు వగైరాల స్థలం అ. 27-1లు. **ఉత్తరం:** జె.ఎం.గ్జేవియర్ వగైరాల స్థలం అ. 40-0లు.
అమీనా కిమ్మత్తు: రూ. 12,04,000/-

1 నుండి 7 అయిటమ్‌ల మొత్తం
అమీనా కిమ్మత్తు (విలువ) రూ. 89,42,400/-

అంబటి మణికుమార్
అడ్వకేట్, ఏలూరు

మహారాజశ్రీ ఏలూరు అదనపు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

ఇ.పి. నెం. 113/2013 ఇన్ ఓ.ఎస్. నెం. 139/2009

బిట్వీన్:
గర్లపాటి కృష్ణమూర్తి -డిక్రీ హోల్డర్
మరియు
చారుగుళ్ల సుబ్బరాజు & వగైరా -జడ్జిమెంట్ డెటార్సు

పై నెంబరు దాఖలా వారంటు గ్రంథములో డిక్రీ బాకీ వసూలు నిమిత్తం ఈ దిగువ ఇ.పి. షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని పై కోర్టులో **ది. 14-12-2023వ తేదీన ఉదయం గం॥ 10.30లకు** బహిరంగంగా వేలం వేయుదురు. కావలసిన వారు సదరు వేలంలో పాల్గొని పాడుకొనవచ్చును.

వాది తరపు దాఖలు చేసిన ఇ.పి. షెడ్యూలు దాఖలా ఆస్తి

పశ్చిమగోదావరి జిల్లా, చింతలపూడి మండలం, చింతలపూడి సబ్ రిజిష్ట్రీ, చింతలపూడి గ్రామ కంఠం, ఆర్.యస్. నెం. 913/1ఎ రు దాఖలా మొత్తము చ॥గ॥ 1118-2లు స్థలము మరియు డోరు నెం. 8-45రు అసెస్‌మెంట్ నెం. 1006, 1007 మరియు అందులో గల పంచాయితీ అసెస్‌మెంట్ నెం. 3901రు గల రేకుల షెడ్డు వగైరా క్రింద తెలిపిన 7 అయిటమ్ ఆస్తికి హద్దులు:

ఐటమ్ నెం.1: పశ్చిమగోదావరి జిల్లా, చింతలపూడి మండలం, చింతలపూడి సబ్ రిజిస్ట్రారు యిలాకా, చింతలపూడి గ్రామ కంఠంలో ఆర్.యస్. నెం. 913/1ఎ రు దాఖలా య. 15-98ట్లులో గురుభట్లగూడెం రోడ్డుకు ఉత్తరము వైపున గల చ॥గ॥ 134-0-0లు ఖాళీ స్థలమునకు హద్దులు: **తూర్పు:** కొనకళ్ళ సాయిబాబా వగైరాలు మరియు సత్రం స్థలము అ. 32-7లు. **దక్షిణం:** గురుభట్లగూడెం రోడ్డు అ. 39-5లు. **పడమర:** పంచాయితీ రోడ్డు అ. 30-0లు. **ఉత్తరం:** ఐటమ్ నెం.2రు దాఖలా స్థలం అ. 37-8లు.
అమీనా కిమ్మత్తు: రూ. 10,72,000/-లు

ఐటమ్ నెం.2: పశ్చిమగోదావరి జిల్లా, చింతలపూడి మండలం, చింతలపూడి సబ్ రిజిస్ట్రారు యిలాకా, చింతలపూడి గ్రామ కంఠంలో ఆర్.యస్ నెం. 913/1ఎ రు దాఖలా య. 15-98ట్లులో గురుభట్లగూడెం రోడ్డుకు ఉత్తరము వైపున గల చ॥గ॥ 117-2-0లు ఖాళీ స్థలమునకు హద్దులు: **తూర్పు:** కొనకళ్ళ సాయిబాబా వగైరాలు మరియు సత్రం స్థలము అ. 32-7లు. **దక్షిణం:** ఐటమ్ నెం.1 దాఖలా కొనకళ్ళ సాయిబాబా వగైరాలు మరియు సత్రం స్థలము అ. 58-6లు. **పడమర:** పంచాయితీ రోడ్డు అ. 18-7లు. **ఉత్తరం:** ఐటమ్ నెం.3రు దాఖలా స్థలం అ. 58-3లు.
అమీనా కిమ్మత్తు: రూ. 9,37,600/-లు

ఐటమ్ నెం.3: పశ్చిమగోదావరి జిల్లా, చింతలపూడి మండలం, చింతలపూడి సబ్ రిజిస్ట్రారు యిలాకా, చింతలపూడి గ్రామ కంఠంలో ఆర్.యస్. నెం. 913/1ఎ రు దాఖలా య. 15-98ట్లులో గురుభట్లగూడెం రోడ్డుకు ఉత్తరము వైపున గల చ॥గ॥ 189-3-0లు ఖాళీ స్థలమునకు హద్దులు: **తూర్పు:** చిట్లూరి నారాయణరావు గారి స్థలం అ. 23-8లు. **దక్షిణం:** ఐటమ్ నెం.2రు దాఖలా స్థలం అ. 58-3లు. **పడమర:** పంచాయితీ రోడ్డు అ. 30-4లు. **ఉత్తరం:** ఐటమ్ నెం.4రు దాఖలా స్థలం అ. 68-0లు.
అమీనా కిమ్మత్తు: రూ. 15,14,400/-

ఐటమ్ నెం.4: పశ్చిమగోదావరి జిల్లా, చింతలపూడి మండలం, చింతలపూడి సబ్ రిజిస్ట్రారు యిలాకా, చింతలపూడి గ్రామ కంఠంలో ఆర్.యస్. నెం. 913/1ఎ రు దాఖలా య. 15-98ట్లులో గురుభట్లగూడెం రోడ్డుకు ఉత్తరము వైపున గల చ॥గ॥ 157-7-0లు ఖాళీ స్థలమునకు హద్దులు: **తూర్పు:** చిట్లూరి చలపతిరావు గారి స్థలం అ. 25-1లు. **దక్షిణం:** ఐటమ్ నెం. 3రు దాఖలా స్థలం అ. 68-0లు. **పడమర:** పంచాయితీ రోడ్డు అ. 15-6లు. **ఉత్తరం:** ఐటమ్ నెం.5రు దాఖలా స్థలం (ఐటమ్ నెం.5, 41.3లు మరియు చిట్లూరి చలపతిరావు గారి స్థలం అ. 30.9లు) అ. 72-0లు.
అమీనా కిమ్మత్తు: రూ. 12,61,600/-

ఐటమ్ నెం.5: పశ్చిమగోదావరి జిల్లా, చింతలపూడి మండలం, చింతలపూడి సబ్ రిజిస్ట్రారు యిలాకా, చింతలపూడి గ్రామ కంఠంలో ఆర్.యస్. నెం. 913/1ఎ రు దాఖలా య. 15-98ట్లులో గురుభట్లగూడెం రోడ్డుకు ఉత్తరము వైపున గల చ॥గ॥ 182-0-0లు ఖాళీ స్థలమునకు హద్దులు: **తూర్పు:** చిట్లూరి చలపతిరావు గారి స్థలం అ. 35-0లు. **దక్షిణం:** ఐటమ్ నెం. 4రు దాఖలా స్థలం అ. 41-3లు. **పడమర:** పంచాయితీ రోడ్డు అ. 34-11లు. **ఉత్తరం:** ఐటమ్ నెం.6రు దాఖలా స్థలం అ. 52-5లు.
అమీనా కిమ్మత్తు: రూ. 14,56,000/-

ఐటమ్ నెం.6: పశ్చిమగోదావరి జిల్లా, చింతలపూడి మండలం, చింతలపూడి సబ్ రిజిస్ట్రారు యిలాకా, చింతలపూడి గ్రామ కంఠంలో ఆర్.యస్. నెం. 913/1ఎ రు దాఖలా య. 15-98ట్లులో గురుభట్లగూడెం రోడ్డుకు ఉత్తరము వైపున గల చ॥గ॥ 187-1-0లు ఖాళీ స్థలమునకు హద్దులు: **తూర్పు:** చిట్లూరి చలపతిరావు గారి స్థలం అ. 26-5లు. **దక్షిణం:** ఐటమ్ నెం.5 రు దాఖలా స్థలం అ. 52-5లు. **పడమర:** పులిపాటి చక్రధరరావు వగైరాల స్థలం అ. 40-10లు. **ఉత్తరం:** ఐటమ్ నెం. 7రు దాఖలా స్థలం అ. 47-9లు.
అమీనా కిమ్మత్తు: రూ. 14,96,800/-

ఐటమ్ నెం.7: పశ్చిమగోదావరి జిల్లా, చింతలపూడి మండలం, చింతలపూడి సబ్ రిజిస్ట్రారు యిలాకా, చింతలపూడి గ్రామ కంఠంలో ఆర్.యస్. నెం. 913/1ఎ రు దాఖలా య. 15-98ట్లులో గురుభట్లగూడెం రోడ్డుకు ఉత్తరము వైపున గల చ॥గ॥ 150-5-0లు ఖాళీ స్థలమునకు హద్దులు: **తూర్పు:** చిట్లూరి చలపతిరావు గారి స్థలం అ. 34-9లు. **దక్షిణం:** ఐటమ్ నెం. 6రు దాఖలా స్థలం అ. 47-9లు. **పడమర:** పులిపాటి చక్రధరరావు వగైరాల స్థలం అ. 27-1లు. **ఉత్తరం:** జె.ఎం.గ్జేవియర్ వగైరాల స్థలం అ. 40-0లు.
అమీనా కిమ్మత్తు: రూ. 12,04,000/-

1 నుండి 7 అయిటమ్‌ల మొత్తం
అమీనా కిమ్మత్తు (విలువ) రూ. 89,42,400/-

అంబటి మణికుమార్
అడ్వకేట్, ఏలూరు